'ప్రభూ! ధైర్యం వహించండి!'

'ఇంకేం ధైర్యం శేషయ్యా? అయితే ఇంక ఎప్పటికీ మనవూరికీ సిరిపురం ఎంతో సిరిపురానికి మనవూరూ అంతే అవుతూ వుంటుందంటావ్?'

'అదేనండి- సేన సేది-?

'ఛీ! వెధవ పరిస్థితులూ, వెధవ వూళ్లూను:'

'ఇవి ఎప్పుడూ వుండే పరిస్థితులేనండి-'

'అయినా, సిరిపురానికి బొత్తిగా మర్యాద తెలియదోయ్! మనవూరు సిరిపురానికి దూరంగా వెళ్లి గడించుకుంటానన్న దూరాన్ని మళ్ళీ సిరిపురంకూడా గడించుకుంటుందనేదే నాకు తలనొప్పి తెప్పిపెట్టే విషయం. ఎంత మొండి సిరిపురం!'

చిత్తం! ఇలాంటి పరిస్థితులలో అసలు మనవూరు సిరిపురానికి దూరంగా పోతాననడమే తప్పండి-'

'తప్పేనంటావా-మనవూరిదే ఆ తప్పా?'

'ఔనండి!'

శేషయ్యా! మనవూరు సిరిపురం రెండూకూడా వెధవ్వూళ్లే-పద-పట్నంపోయి కాన్నెమారా హోటల్లో బ్రతుకుదాం-'

## యుద్ధానంతరము...

'శేషయ్యా?'

'ప్రభూ!'

'మనం వుత్త వెధవలమోయ్—'

'చిత్తం-ప్రభువులమాట కాదనగలమా?'

'ప్రపంచమంతటా తలమీద వెంట్రుకలులేని వాళ్లందరూ యుద్ధానంతరపు కబుర్లు చెప్పుకుంటూంటే, మనం—'

'చిత్తం, మనం?'

'మనం వెర్రి వెధవల్లా వూరుకున్నాం—'

'వూరుకోనక్ఖర్లేదండి. మనంకూడా ఏదైనా చేదాం.'

'చెయ్యొద్దు మరీ-చెయ్యకుండా వూరుకుంటామా-ఏం శేషయ్యా?'

'వూరుకోమండి-చేసి తీరతాం—'

'రైట్! అలా ప్రోత్సాహ మిచ్చేవాళ్లని చూస్తే నాకు—'

'ఏదో తమదయ!'

'శేషయ్యా?'

'ప్రభూ!'

'ఈ పుస్తకం చూశావా?'

'చిత్తం-కనిపిస్తూందండి—'

'ఇందులో మన యుద్ధానంతర కార్యక్రమాలన్నీ రాసి వున్నాయి-'

'చిత్తం—'

'మచ్చుకి కొన్ని కార్యక్రమాలు వింటావా? ఇవన్నీ నేనే శ్రమపడి రాశాను—'

'ఆ పుస్తకం అట్ట చాలా బావుందండి—వూదా బైండూ, గిల్టు అక్షరాలూ...'

'ఇంకా ఏం చూశావ్-లోపలంతా బంగారు సిరాతో రాసివున్నాను-మన కార్యక్రమాలన్నీ-చూడూ-'

'ప్రభూ! బేషుగ్గావుందండి.'

'రాత స్పష్టంగా వుందా?'

'ముత్యాలకోవండి తమ దస్తూరీ-'

'ఇది మనం ప్రింటుకూడా చేయిద్దాం-'

'తప్పకుండానండి.'

'అది యుద్ధానంతరం మాటలే-ఇప్పుడు కాయితం అదీ దొరకదు-'

'చిత్తం—అంతేనండి-'

'ఇంక కార్యక్రమాలు విను-'

'వింటున్నానండి-'

కథా నిలయం
1114
శ్రీకాకుళం

'మొట్టమొదటి కార్యక్రమం—యుద్ధానంతరం మన సంస్థానంలో పనిచేసే వారందరికీ సరిగ్గా ఒకటో తారీకు నాటికి జీతాలు అందేట్టుగా చేస్తాం—'

'భేష్! బావుందండి-'

'భయపడకు శేషయ్యా—నీ వొక్కడికి మాత్రం ఈ నెలనుంచే ఒకటో తారీకు నాటికి జీతం ఇప్పిస్తాను—'

'చిత్తం—ధన్యుణ్ణి!'

'మరి - రెండో కార్యక్రమం - అదే శేషయ్యా—కునుకుపాట్లు వస్తున్నాయా?'

'లేదండి—రాత్రి సరిగా నిద్రలేదు-'

'సరేలే విను. కొంచమే-రెండో కార్యక్రమం—యుద్ధానంతరం మన సంస్థానంలో ప్రతివ్యక్తీ రెండుపూటలూ భోంచెయ్యవచ్చును-'

'భేష్—బావుందండి—'

'మూడో కార్యక్రమం—విను శేషయ్యా—యుద్ధానంతరం మనం ఒక ఏరోప్లేనును కొనబోతున్నాం—'

'బాంబరాండీ?'

'అవును—బాంబరే. అందులో మా అమాత్య శేఖరులకి కూడా ఒక సీటు రిజర్వుచేయబడింది-'

'ప్రభూ! ధన్యుణ్ణి.'

'శేషయ్యా! ఇంకొక్క కార్యక్రమం వినిపించి ఈ వేళటికి మానేస్తాను—నీకు నిద్రవొస్తున్నట్టుంది—అదేమిటంటే శేషయ్యా—యుద్ధానంతరం మన సంస్థానమంతటా ఎలిమెంటరీ స్కూళ్లు పెట్టించి ప్రజలకు విద్య నేర్పిస్తాం. ఆ స్కూళ్లన్నిటికీ సూపర్‌వైజరుగా మీ పెద్ద అబ్బాయిని వేస్తాం—'

'చిత్తం—ధన్యుణ్ణి!'

'శేషయ్యా! ఈ పుస్తకంలో ఇంకా ఇలాంటి కార్యక్రమా లెన్నో వున్నాయి. నీకుకూడా ఏమైనా తోస్తే—'

'ప్రభూ! నాకళ్ల ముందర ఒక పెద్ద కార్యక్రమం నాట్యమాడు తూందండి—'

'నిజమే శేషయ్యా? ఏదీ చెప్పు?'

'ప్రభూ! యుద్ధానంతరం మనం—'

'చెప్పు శేషయ్యా---ఏమిటదీ?'

'ప్రభూ! వ్రాసుకోండి ఆ పుస్తకంలో—యుద్ధానంతరం మనం చచ్చిపోతాం!'

## గాలిషికారు

'శేషయ్యా?'

'ప్రభూ!'

'చల్లగాలికి అలా కాసేపు తిరిగి వద్దాం వస్తావా?'

'ప్రభువుల మాటకి నేనెప్పుడేనా అడ్డు చెప్పానా?—పదండి—'

'ఎటువేపు వెడదాం?'

'తమ శలవ్-ఎటు వెళ్ళినా వెళ్ళవచ్చునండి-'

'కాలి నడకను వెడదామా, కారులో వెడదామా?'

'యెలా వెళ్ళినా వెళ్ళవచ్చునండి—'

'మళ్ళీ ఎంతసేపట్లో తిరిగి వద్దాం?'

'ఎంతసేపట్లోనైనా తిరిగి రావచ్చునండి—'

'పోనీ వెళ్ళడం మానేస్తే?'

'మానేస్తే మానెయ్యవచ్చునండి—'

'అయినా, కాస్సేపు అలా తిరిగివస్తేనే మంచిదేమో?'

'మంచిదే కావచ్చునండి—'

'అయితే వెడదామా?'

'వెడితే వెళ్లొచ్చునండి—'

'శేషయ్యా! దేవికూడా మనతోబాటు షికారుకి వస్తుందేమో?'

'వస్తే రావచ్చునండి—'